క్లుప్తంగా

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవం

సీతానగరం: మండలంలోని చెల్లన్నాయుడువలసలో డీజీఎస్పీ త్రినాథ్ కుటుంబీకులు నిర్మించిన కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆగమ పండితులు గన్నవరపు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, మహా సంకల్పంతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం సంకల్పం, మండప పూజలు, కాశీవిశ్వేశ్వర పార్థివ లింగమహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అర్చన, ధాన్యాదివాసం, తండులాదివాసం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం హోమాలు, సహస్ర కుంకుమార్చన, సహస్ర దీపాలంకరణ కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం పూర్ణ కుంభ, శివలింగం, విఘ్నేశ్వరుడు, పార్వతీదేవి విగ్రహాల ప్రతిష్ఠ, అన్నసంతర్పణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు 157 మంది హాజరు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మక్కువ: మండలంలోని ములక్కాయవలస మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం పరీక్ష నిర్వహించారు. ప్రవేశ పరీక్షకు 185 మంది దరఖాస్తు చేసుకోగా.. 157 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు. 28 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. క్వాలిఫై అయిన వారికి సమాచారం అందిస్తామన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సత్కారం



పృథ్వీరాజ్‌ను సత్కరిస్తున్న ఎస్.ఎన్.మూర్తినగర్ అసొసియేషన్

పార్వతీపురం టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న సౌందర్య నారాయణమూర్తినగర్‌లో నివాసముంటున్న దోనక విజయ్‌కుమార్, వెంకటరత్నం దంపతుల కుమారుడు పృథ్వీరాజ్ ఇటీవల సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో ఎస్.ఎన్.మూర్తి నగర్ ఫ్యామిలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక షిర్డీసాయి ధ్యాన మందిరం వద్ద శనివారం రాత్రి పృథ్వీరాజ్ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు ఆయన్ను ఘనంగా సత్కరించారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా

మక్కువ: మండల కేంద్రం మక్కువలో నీటిఎద్దడి నెలకొంది. భూగర్భ జలాలు అడుగంటడంతో నేలబావులు, బోర్లలో నీటిమట్టం తగ్గిపోయింది. దీంతో స్థానికులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మావుడి సోదరులు మండల కేంద్రంలోని అన్ని వీధుల్లో ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మహిళలు ట్యాంకర్ల వద్ద నీటిని పట్టుకుంటున్నారు. ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్న మావుడి సోదరులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ముగిసిన సింహాద్రప్పన్న సంబరాలు



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

సీతానగరం: మండలంలోని గుచ్చిమిలో మూడు రోజులుగా నిర్వహించిన సింహాద్రప్పన్న సంబరాలు ఆదివారం ముగిశాయి. గ్రామానికి చెందిన బంకురు, బల్ల, పెద్దింటి, శెట్టి, నడిమింటి, పోల కుటుంబీకులు పూర్వీకుల నుంచి ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు సింహాద్రప్పన్నకు పూజలు చేశారు. తప్పెటగుళ్లు, భజన పాటలతో స్వామివారిని కీర్తించారు. రాత్రి పూట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరిరోజున వేలాది మంది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

తగాదాలకు తావివ్వొద్దు..



కళ్లికోటలో అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ సునీల్ షారోన్

కొమరాడ: మండలంలోని కళ్లికోట గ్రామంలో వేపారమ్మ తల్లి పండగ నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి తగదాలకు తావివ్వొద్దని ఏఎస్పీ సునీల్ షారోన్ అన్నారు. కళ్లికోట గ్రామంలో పండగ నేపథ్యంలో ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ పండగకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు చోటివ్వద్దని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. పార్వతీపురం సీఐ కె.రవికుమార్, స్థానిక ఎస్‌ఐ కె.నీలకంఠం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి మద్దతివ్వండి



పట్టణంలోని 5వ వార్డులో ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

- ఫ్యాన్ గుర్తుపై ఓటు వేద్దాం.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం..
- చంద్రబాబు మోసపూరిత హామీలు నమ్మి మోసపోవద్దు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్దామని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు ప్రజలను కోరారు. పట్టణంలోని 5, 8, 11వ వార్డుల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల ప్రజలు ఎమ్మెల్యే జోగారావుకు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారుతులు ఇచ్చి విజయతిలకం దిద్దారు. స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరించారు.

2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు 600 హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిలో ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఇప్పుడు ఎన్నికలు రావడంతో మరోసారి ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్య పెట్టేందుకు వస్తున్నారని, ఆయన మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు. ఈ ఐదేళ్లలో తాము నిత్యం ప్రజల మధ్యే ఉంటూ.. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించామన్నారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శక పాలన అందించామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, రోగులు, ఒంటరి మహిళలకు ఇంటి వద్దకే పింఛన్ డబ్బులు అందించామని గుర్తుచేశారు. అది చూసి ఓర్వలేక చంద్రబాబు తన అనుచరులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వృద్ధులు, దివ్యాంగులను ఇబ్బందులకు గురిచేయించారన్నారు. గత ప్రభుత్వ పాలనను, వైఎస్సార్‌సీపీ పాలనను బేరీజు వేసుకోవాలని సూచించారు. మేలు జరిగిందని మీకు అనిపిస్తే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, జేవైఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, సువ్వాడ లావణ్య, జయంతి, జే దివ్య, భాస్కరరావు, మేరువ వెంకటరావు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేసుకుందాం..

సీతానగరం: పేదల పెన్నిధి, సంక్షేమ రథసారథి అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని ఏగోటివలస గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ యు.రాధాకృష్ణ, కె.కృష్ణమూర్తి, కె.అప్పలనాయుడు, మండల నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని వివరించారు. ప్రతీ గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. మీకు మేలు జరిగిందని అనిపిస్తే.. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటి వద్ద ఆయనకు మహిళలు హారుతులు ఇచ్చి విజయతిలకం దిద్దారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ సీనియర్ నాయకులు బి.శ్రీరాములునాయుడు, పార్థసారధి, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, స్థానిక ఎంపీటీసీ టి.పార్వతి, స్థానిక నాయకులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సీతానగరం: ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు విజయతిలకం దిద్దుతున్న వృద్ధురాలు



సీతానగరం: కోలాట కళాకారులతో ఎమ్మెల్యే జోగారావు

ఆశీర్వదించండి.. ఆదుకుంటాం..



ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం రాజన్నదొర

- ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ప్రజా ప్రభుత్వానికి పట్టం కట్టండి
- మరింత అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తాం..
- ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం రాజన్నదొర



మహిళలకు ప్రచార కరపత్రాలు అందజేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: మే 13న జరిగే పోలింగ్‌లో ప్రజలంతా ఫ్యాను గుర్తుపై ఓటు వేసి, ప్రజా సంక్షేమ పాలనకు మరోసారి పట్టం కట్టాలని డిప్యూటీ సీఎం, సాలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర కోరారు. పట్టణంలోని ఘల్జీపేటలో స్థానిక కౌన్సిలర్ బీసపు హైమావిజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ప్రతీ గడప వద్ద రాజన్నదొరకు మహిళలు హారతులు ఇచ్చి ఆత్మీయ స్వాగతం పలికారు. ఐదేళ్లలో చేసిన సంక్షేమాన్ని, అభివృద్ధిని రాజన్నదొర ప్రజలకు వివరించారు. అన్ని వర్గాలకు మంచి చేయడమే మా ప్రభుత్వ అజెండా అని అన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రజలకు మంచి చేసింది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కాగా, మోసం చేసింది చంద్రబాబు ప్రభుత్వమని విమర్శించారు. ఎన్నికల వేళ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు మోసపూరిత హామీలతో టీడీపీ నాయకులు వస్తున్నారని, వారి మాయమాటలు నమ్మి మోస పోవద్దని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి తనను, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, గిరిరఘు, రాపాక మాధవరావు, బీసపు బాలకృష్ణ, బవిరెడ్డి ప్రసాద్, పిరిడి రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

సంక్షేమం కావాలంటే.. ఫ్యాన్ గుర్తుపై ఓటేయండి



సాలూరు రూరల్: ఎన్నికల ప్రచారంలో జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ

సాలూరు రూరల్: సంక్షేమం కావాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా పీడిక రాజన్నదొరను గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ పిలుపునిచ్చారు. పెదపదం గ్రామంలో ఆదివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రతిపక్షాలు చెపుతున్న మోసపూరిత హామీలు నమ్మొద్దని హితవుపలికారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

డీజేలు, సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదు

సాలూరు: ప్రజారోగ్యం, శాంతిభద్రతల దృష్ట్యా ప్రస్తుతం పట్టణంలో ఎటువంటి డీజేలు, సౌండ్ సిస్టమ్‌లకు అనుమతులు మంజూరు చేయడం లేదని సీఐ వాసునాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా ఎవరైనా డీజేలు, సౌండ్ బాక్సులు పెడితే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. రాత్రి 10 గంటల తరువాత ఎటువంటి ఊరేగింపులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

స్ట్రాంగ్‌రూం పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంను సాలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ ఆదివారం పరిశీలించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడి భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



సీతానగరం: టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు



పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై టీడీపీ నాయకులు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని రావికోన గ్రామంలో టీడీపీకి చెందిన 80 కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారందరికీ ఎమ్మెల్యే జోగారావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలంతా సమష్టిగా పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. రానున్న ఎన్నికల్లో మీరంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయడంతో పాటు మీకు తెలిసిన వారు కూడా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసేలా చూడాలని కోరారు.

అంటిపేట నుంచి..

సీతానగరం: మండలంలోని అంటిపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏగోటివలసలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఎన్నికల ప్రచారం సందర్భంగా సర్పంచ్ బి.తిరుపతిరావు, ఎంపీటీసీ ఎస్.తిరుపతిరావు ఆధ్వర్యంలో వారంతా పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే జోగారావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కె.సింహాచలం, కె.శ్రీనివాసరావు, బి.చిన్నయ్య, బోనెల రామకృష్ణ, టి.శివ, జి.సుందరరావుతో పాటు మరో 10 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, పార్టీ సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, ఏగోటివలస సర్పంచ్ యు.రాధాకృష్ణ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, అంటిపేట సచివాలయ కన్వీనరు ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.

జగనన్న వల్లే పిల్లల చదువులు



పాలకొండ రూరల్: పెద్దకాపువీధి ప్రభుత్వ పాఠశాలలో చదువుల్లో నిమగ్నమైన విద్యార్థులు

- నియోజకవర్గంలో 31,421 మంది విద్యార్థులకు యూనిఫారాలు, బూట్లు, పుస్తకాల పంపిణీ
- కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

2023 - 24 విద్యా సంవత్సరంలో విద్యా కానుక వివరాలు ఇలా...

మండలం	స్కూల్స్	యూనిఫారాలు	బూట్లు	బ్యాగ్స్	బెల్ట్స్	పాఠ్య పుస్తకాలు
కురుపాం	174	7664	7664	7664	6089	38044
కొమరాడ	127	5916	5916	5916	4315	30946
జి.ఎల్.పురం	170	9240	9240	9240	7025	44562
గరుగుబిల్లి	57	4024	4024	4024	2649	24060
జి.ఎం.వలస	95	4577	4577	4577	3425	24192
మొత్తం	623	31421	31421	31421	23505	161804

కురుపాం: పేద పిల్లలు కార్పొరేట్ విద్యనభ్యసించాలనే సదుద్దేశంతో రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా వ్యవస్థను సమూలంగా మార్పు చేసింది. నాడు - నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలే మార్పు చేసింది. పాఠశాలలకు సకల సదుపాయాలను కల్పించింది. విద్యార్థిని బడికి పంపితే చాలు...అన్నీ తానై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పిల్లల చదువు బాధ్యతను తీసుకుంది. విద్యకు కావాల్సిన పుస్తకం నుంచి యూనిఫారాల వరకు అన్నీ సమకూర్చింది. విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పంపిణీ చేస్తోంది. కురుపాం నియోజకవర్గంలో 623 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 31,421 మంది విద్యార్థులకు 2023 -24 విద్యా సంవత్సరానికి సంబంధించి లక్షా 61 వేల 804 నోటు పుస్తకాలను పంపిణీ చేసింది. అలాగే యూనిఫారాలు, బ్యాగులు, బెల్టులు, నోటు పుస్తకాలు కూడా అందజేసింది. పేదల విద్య కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమం ద్వారా పిల్లలంతా కార్పొరేట్ విద్యకు ధీటుగా ఎదుగుతున్నారు. దీన్ని చూసి తల్లిదండ్రులుసంబరపడుతున్నారు. తమపిల్లల ఆంగ్లచదువులు చూసి తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.

నిరుపేదలకు మెరుగైన విద్య



నా కుమారుడు బడ్డి సురేష్ చిన్నమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ప్రతీ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే జగనన్న విద్యా కానుక ద్వారా సరఫరా చేస్తుంది. ఈ ఏడాది కూడా జేవీకే కిట్స్‌ను అందించింది. నిరుపేదలకు మెరుగైన విద్య, సౌకర్యాలను అందించటం ఎంతో సంతోషంగా ఉంది. – బడ్డి రవణమ్మ, అల్లువాడ, జియ్యమ్మవలస మండలం



మాది మధ్యతరగతి కుటుంబం. నాకు ముగ్గురు పిల్లలు. నా భర్త మృతితో పిల్లల బాధ్యత నాపై పడింది. కుటుంబ పోషణ కోసం వస్త్ర దుకాణంలో పని చేస్తున్నాను. ప్రైవేటు బడుల్లో పిల్లలను చదివించే స్తోమత లేదు. ఈ క్రమంలో జగనన్న అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే అమాంతం మారిపోయాయి. విద్యార్థికి కావాల్సిన సకల సదుపాయాలు కల్పించారు. దీంతో నా పిల్లలను కాపు వీధిలో గల ప్రభుత్వ బడిలో వేశాను. పెద్దమ్మాయి జ్యోత్స్న పదో తరగతి, తరుణ్ ఆరు, చిన్నోడు వరుణ్‌తేజ్ మూడో తరగతి చదువుతున్నారు. పిల్లలకు కావాల్సిన పుస్తకాలతో అన్నీ ఇస్తున్నారు. మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. అమ్మ ఒడి ఇస్తున్నారు. అసలు నా పిల్లల బాధ్యత జగనన్నే మోస్తున్నారు. దీంతో ఎంతో ధైర్యం వచ్చింది.

– జంపా లక్ష్మి, పాలకొండ

విద్యార్థులకు ఒక వరం



నాకు ఇద్దరు కుమార్తెలు. మరడ దీపిక 8వ తరగతి, మరడ దీపన 7వ తరగతి స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్నారు. నా ఇద్దరు పిల్లలకు జగనన్న విద్యా కానుకలో భాగంగా ప్రతీ ఏడాది యూనిఫారాలు, బూట్లు, బెల్ట్స్, నోట్‌బుక్స్, అన్ని విద్యా సంవత్సరం ప్రారంభమైన వెంటనే సరఫరా చేస్తున్నారు. ప్రైవేటు విద్యకు ధీటుగా విద్య బోధన కూడా అందిస్తున్నారు. జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి వంటివి మాలాంటి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

– మరడ జానకి, రాజ్యలక్ష్మీపురం, కొమరాడ మండలం



నిశితంగా పరిశీలించాలి



విశాఖ రహదారిలో మంగళాపురం వద్ద చెక్‌పోస్టులో రికార్డులు చూస్తున్న సీఐ

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపడుతున్న సిబ్బంది లోతుగా పరిశీలించాలని పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి సిబ్బందిని ఆదేశించారు. పాలకొండ- విశాఖ రహదారిలో చిన మంగళాపురం కూడలిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆకస్మికంగా శనివారం సందర్శించారు. ఈ క్రమంలో అక్కడి రికార్డులు, నమోదైన కేసులు, పట్టుబడిన నగదు వివరాలకు సంబంధించిన తాజా సమాచారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారుల పట్ల గౌరవంగా మెలగాలని, అనుమానిత కదలికలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తీసుకు వచ్చే నగదు, మద్యం, ఇతర నిషేధిత పదార్థాల తరలింపు జరగకుండా చూడాలన్నారు. ఎండల తీవ్రతలను అలసత్వం చేయకుండా, తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. రాత్రి సమయంలో తనిఖీలు చేపడుతున్న సిబ్బంది విధిగా రేడియం జాకెట్లు ధరించాలన్నారు.